క్లుప్తంగా...

నేడు అగ్రీ లీగల్ ఎయిడ్ ప్రారంభం

శామీర్‌పేట్: మేడ్చల్ మండలంలో అగ్రి లీగల్ ఎయిడ్ కేంద్రాలను గురువావం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అర్చన పత్రిక ప్రకటనలో బుధవారం తెలిపారు. మండల పరిధిలోని రాయిలాపూర్, పూడూర్ రైతు వేదికల్లో అగ్రి లీగల్ ఎయిడ్ క్లీనిక్ (వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం)లను మేడ్చల్ జిల్లా న్యాయమూర్తి ప్రారంభిస్తారని, అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

సబ్సిడీపై ఎరువులు

శామీర్‌పేట్: సబ్సిడీపై ఎరువులు అందుబాటులో ఉన్నాయని మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి పత్రిక ప్రకటనలో బుధవారం తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జిలుగ విత్తనాలు 65 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని, 40 కేజీల జనుము సబ్సిడీ ద్వారా రూ.1224.80, జిలుగ కేజీల బస్తా రూ.842.70కి ఇవ్వడం జరగుతుందన్నారు. కావున రైతులు తమ భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు కాపీలను తీసుకొని మూడుచింతలపల్లి రైతువేదికలో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం తిరిగి పంపించడం అన్యాయం



ధాన్యం పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: తడిసిన కారణంగా మొలకెత్తిన ధాన్యం కూడా కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకుంటామన్న సీఎం హామీ తుంగలో తొక్కి రైస్ మిల్లులకు పంపిణీ చేసే ధాన్యాన్ని తేమ సరిగా లేదని తిరిగి పంపడం అన్యామని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్ల అనంతరం వెనక్కి పంపిన మాదారం రైతుల ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. 25 రోజుల పాటు ఎండబోసి విక్రయించిన ధాన్యం తేమ పేరుతో వెనక్కి పంపించకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికార పక్షం నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు ఆపి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

23 అభివృద్ధి పనులకు తీర్మానం

శామీర్‌పేట్: మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన 23 అభివృద్ధి పనుల ఎజెండాను ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ రమేష్, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

శామీర్‌పేట్: మేడ్చల్‌లో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మేడ్చల్‌లో 2,520 మంది విద్యార్థులకు 9 సెంటర్లను ఏర్పాటు చేయగా 2,140 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిచ్చారు.

పన్నాల ప్రభాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి

కీసర: కీసర శ్రీప్రసన్నాంజనేయస్వామి, శ్రీరామచంద్రస్వామి దేవాలయాల అభివృద్ధికి దివంగత పన్నాల ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని కీసర గ్రామసర్పంచ్ నాయకపు మాధురి అన్నారు. బుధవారం దివంగత పన్నాల ప్రభాకర్‌రెడ్డి 10వ వర్ధంతిని పురస్కరించుకొని కీసర రామాలయ మండపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, శ్రీసీతారామచంద్రాస్వామి దేవాలయ చైర్మన్ నాయకపు వెంటేష్, కన్వీనర్ పన్నాల సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ శ్రావన్ కుమార్‌గుప్తా, రామభక్తమండలి సభ్యులు, రామకృష్ణ, ఆంజనేయులు, రామిడి విజయ్‌రెడ్డి, మురళి, గంగారామ్, తంగళ్లపల్లి వెంకటేష్, జంగయ్యాయాదవ్, జూపల్లి రవీందర్, బాల్‌రెడ్డి, రవీందర్, మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత దిశగా.. పంచాయతీలు

పల్లెల్లో ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాలు

- పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన.. విస్తృత ప్రచారం
- మేడ్చల్ జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు
- ప్రతినెలా పల్లె ప్రగతి కింద పనులకు రూ.2.41 కోట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. పల్లెల్లో బుధవారం నుంచి ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాల్లో వారం రోజులపాటు పరిశుభ్రత పనులను కొనసాగించనున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించాల్సి ఉన్నప్పటికీ, ఎంపీఓల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు పారిశుద్ధ్య వారోత్సవాలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రతపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.



- జిల్లాలోని ఐదు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ప్రతీ నెలకు రూ.2.41 కోట్లు కేటాయిస్తున్నారు. ఈ నిధులతో గ్రామంలో అవసరమున్న పనులకు పంచాయతీలు వినియోగిస్తున్నాయి.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

- పల్లెల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వారం రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏటా వానాకాలం ముందు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శులు 16 రోజులుగా సమ్మె చేయడంతో 30 గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కొంత ప్రభావం పడింది. రోజూ ఉదయం వారు గ్రామానికి వెళ్లి కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించేవారు. సమ్మె కారణంగా ఇబ్బందులు తలెత్తడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. అన్ని పంచాయతీల్లో కలిపి మొత్తం 778 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతీ 500 జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడి చొప్పున 61గ్రామ పంచాయతీల్లో 778 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో వీరు ప్రత్యేక కార్యాచరణలో భాగస్వాములు కానున్నారు. వారోత్సవాలను మండల ప్రత్యేకాధికారులు కూడా పర్యవేక్షిస్తారు.

వారోత్సవాల్లో ఇలా..

- పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి.
- ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రై డే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీ



ట్యాంకులు, పశువుల తొట్లను శుభ్రంచేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.
- వైకుంఠధామాలకు విద్యుత్తు, నీటి వసతి కల్పించడం, తడి, పొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ. శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి, పాడుబడిన బావులను పూడ్చివేయడం, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు తొలగించడం వంటి పనులు చేయాలి.
- ప్రభుత్వ ప్రజోపయోగ సంస్థల్లో శుభ్రత పనులు, ఇంకుడు గుంతలను నిర్మించేలా చూడాల్సి ఉంది. మిగిలిపోయిన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం.

పనులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో వారం రోజులపాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించాం. ఇళ్లు, ట్యాంకులను శుభ్రం చేయడంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక కార్యాచరణ అమలుపై గ్రామాల వారీగా మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు.

- రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి, మేడ్చల్ జిల్లా

అవుషాపూర్ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత బీమా



పారిశుద్ధ్య కార్మికులకు బీమా చేయిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10 లక్షల టాటా ఏఐజీ ఉచిత బీమాను బుధవారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ట్రస్ట్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికులకు అత్యవసర సమయంలో ఉపయోగకరంగా ఉండాలని ఉచితంగా బీమా చేయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు రాధా, మల్లేశ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం మేయర్ మేకల కావ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్‌అలీ, ఆశ వర్కర్లు, నాయకులు నాగభూషణం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ కావ్య

రూ.500లకు వంట గ్యాస్



సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని మేడ్చల్-మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. జోడో యాత్రలో భాగంగా బుధవారం మచ్చబొల్లారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ తిరిగారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సన్మానం



శామీర్‌పేట్: సమాజంలో శాంతిని ప్రోత్సహించడానికి కృషిచేస్తున్న ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థను మేడ్చల్ ట్రాఫిక్ సీఐ బీఎస్ రెడ్డి ప్రశంసించారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ 10వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్న ట్రాఫిక్ పోలీసులను బుధవారం సన్మానించారు.

ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

శామీర్‌పేట్: ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగలను మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మేడ్చల్ పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బి.రమేష్(30), తాను దొంగిలించిన బైక్‌తో పట్టుబడ్డాడు. బైక్ పత్రాలు లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి విచారణ నిమిత్తం అతడిని అదుపులోకి తీసుకున్నారు. జగద్గిరిగుట్టకు చెందిన మంజునాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తుంటామని ఒప్పుకున్నాడు. చోరీ చేసిన వాహనాలను మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్‌కు చెందిన శివకుమార్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. శివకుమార్‌తో పాటు 5 ద్విచక్రవాహనాలను అదుపులోకి తీసుకున్నామని, జగద్గిరిగుట్టకు చెందిన మంజునాథ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వివరించారు. సమీవేశంలో మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, డీఐ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ బీఎస్ రెడ్డి, క్రైమ్ ఎస్సై నర్సింహ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన క్రీడలు



వాలీబాల్ విజేత ఏదులాబాద్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడలు బుధవారం ఘనంగా ముగిశాయి. వాలీబాల్‌లో ఏదులాబాద్ మొదటి స్థానం, మర్పల్లిగూడ రెండో స్థానం, ఖోఖోలో అంకుషాపూర్ మొదటి స్థానం, ప్రతాపసింగారం రెండో స్థానంలో నిలిచింది. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణారెడ్డి, జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్ కుమార్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శోభారాణి, రవి, రామారావుముదిరాజ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వేణు, శ్రీనివాస్, యుగేందర్‌గౌడ్, బాలరాజ్‌ముదిరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, అనిత, యాదవలక్ష్మీ, లక్ష్మీ, మల్లేశ్‌ముదిరాజ్, విజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం

శామీర్‌పేట్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అన్నారు. మండల స్థాయి సీఎం కప్‌లో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బుధవారం బహుమతులను అందజేశారు. వైస్ ఎంపీపీ వెంకటేశం, రైతుబంధు సమితి చైర్మన్ నందారెడ్డి, జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లిలో..

మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాల యువతీ, యువకులు పలు క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బుధవారం ఎంపీపీ హారిక అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి

గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడాపోటీలు

కీసర: గ్రామాల్లో క్రీడాకారులను పోత్సహించాలన్న లక్ష్యంతో మండలస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ మేరకు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీ వత్సలదేవి, ఎంఈఓ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



కీసర విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు

గ్రంథాలయం.. దేవాలయమే..

- ప్రతి మండలంలో ఆధునిక గ్రంథాలయాలు
- కీసరలో రూ.కోటితో గ్రంథాలయ భవనం
- భూమిపూజలో మంత్రి మల్లారెడ్డి



కీసరలో గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజలో మంత్రి మల్లారెడ్డి తదితరులు

కీసర: సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి మండలంలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమైనట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కీసరలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి నిధులతో నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థలో రూ.21 కోట్ల వరకు నిధులున్నాయని, ఇందులో వివిధ ప్రాంతాల్లో కొత్తగా గ్రంథాలయాలను నిర్మించేందుకు సుమారు రూ.8 నుంచి రూ.9 కోట్ల మేర నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఇక గ్రంథాలయాన్ని నిర్మించుకుంటున్నామంటేనే ఓ పవిత్ర దేవాలయాన్ని నిర్మించుకుంటున్నట్లే అన్నారు. కీసరలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. కొత్త గ్రంథాలయంలో యువత, విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసేవారికి ఇలా అందరికీ ఉపయోగపడే బుక్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

భోగారం, తిమ్మాయిపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన



భోగారం గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య తదితరులు

కీసర: భోగారం, తిమ్మాయిపల్లి గ్రామాల్లో బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణి పర్యటించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, గ్రేవ్‌యార్డు, డంపింగ్ యార్డు తదితర వాటిని పరిశీలించారు. భోగారం గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మురుగు నీటి అవుట్‌లెట్ సమస్యను గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎక్కడైతే మురు నిలుస్తుందో అక్కడ మురుగునీటిని శుద్ధి చేసేందుకు సంప్‌ను నిర్మించాలని, సంప్‌లోకి వచ్చే మురుగును శుద్ధిచేసి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లేవిధంగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు కవితాజైహింద్ రెడ్డి, పెంటయ్య, ఉపసర్పంచులు జానకీరాం, ఇంజినీరింగ్ అధికారులు, గ్రామకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి

జిల్లా సమన్వయ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మాతా శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు ఆదేశాల మేరకు బుధవారం మేడ్చల్‌లో ఆరోగ్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కోట్యానాయక్‌తో కలిసి ఆయన జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది బర్త్ ప్లానింగ్, ఐఫఏ టాబ్లెట్స్, కుటుంబ నియంత్రణ, ఆరోగ్య మహిళా, 24 గంటల ల్యాబ్, ఎమర్జెన్సీ ఆపరేషన్లు, పోస్ట్ మార్టర్మ్ సేవలను నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సి-సెక్షన్‌లను తగ్గించాలన్న మంత్రి హరీష్‌రావు దార్శనికతపై ప్రత్యేక శ్రద్ధ, చొరవ, చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన ఆదేశించారు. గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్యులకు, అవాంఛిత సిజేరియన్లను తగ్గించాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా వైద్యాధికారులు, వైద్యులు పనిచేయాలన్నారు.

సేవలను విస్తృతం చేయాలి

జిల్లాలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ల సేవలు, టెలీకాన్సులేషన్, అవుట్ పేషెంట్ మాడ్యూల్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల అందజేత వంటి విషయాలను డీఎంహెచ్ఓ అడిగి తెలుసుకున్నారు. కొత్త వైరస్‌లు, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని వారి సేవలను డాక్టర్ శ్రీనివాస్ కొనియాడారు. సీఆర్‌పీలో శిక్షణ పొందేందుకు వైద్య సిబ్బందిని గుర్తించడంతోపాటు కార్యాచరణ ప్రణాళిక, శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మాస్టర్ ట్రైనర్‌కు సంబంధించి ఒక్కో బ్యాచ్‌కి 20 చొప్పున 3 బ్యాచ్‌లలో ప్రతీ రోజు 60 మంది వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

అవినీతి బయట పెడితే దాడులా..?

కీసర: కీసర గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతి – నిధుల దుర్వినియోగంపై చట్టప్రకారం పక్కా ఆధారాలతో పోరాటం చేస్తున్న కీసర బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డిపై సర్పంచ్ నాయకపు మాధురి, భర్త నాయకపు వెంకటేష్ దౌర్జన్యానికి దిగి అతడిపై అనుచిత వాఖ్యలు చేయడమే కాకుండా దాడి చేసేందుకు యత్నించడాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర నేత సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో కీసర అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ కీసర గ్రామపంచాయతీలో జరుగుతున్న అవినీతిపై కొన్ని నెలలుగా కీసర బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి పోరాటం చేస్తూ ఆధారాలతో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రమణమూర్తి, డీఎల్‌పీఓ అధికారితో కీసర పంచాయతీలో నిధుల అవినీతిపై విచారణ చేపట్టి సుమారు రూ.26 లక్షల అవినీతి జరిగిందని నివేదిక సైతం అందజేశారన్నారు. ఇదే విషయమై మంగళవారం కీసర గ్రామసభలో బండారి శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకురాగా సహనం కోల్పోయిన సర్పంచ్ భర్త నాయకపు వెంకటేష్ నోరు జారడంతో పాటు దాడి చేసేందుకు యత్నించాడన్నారు. శ్రీనివాస్‌రెడ్డిపై దాడికి యత్నించడంతో పాటు చంపుతానని బెదిరించిన అతడిపై కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, నేతలు కొలిచెలిమి కృష్ణ, దానోళ్ల మల్లేష్, నల్ల వెంకట్‌రెడ్డి, రాగుల అశోక్‌ముదిరాజ్, మెట్టు కృష్ణాయాదవ్, కుంటోళ్ల ఆంజనేయులు, ఐలయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

డంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలు

ఫైరింజన్‌తో మంటలార్పించిన చైర్ పర్సన్

ఘట్‌కేసర్: వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో బుధవారం ప్రమాదవశత్తు మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి, స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని డంపింగ్‌యార్డ్ పరిసరాలను పరిశీలించారు. పక్కనే హెచ్‌పీసీఎల్ ఉన్నందున మంటలు అదుపు తప్పితే ప్రమాదం జరుగుతుందని భావించి చెర్లపల్లి ఫైరింజన్ సిబ్బందితో మంటలు ఆర్పివేయించారు. గతంలోనూ మంటలు చెలరేగాయని, ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, చిత్రంలో చైర్ పర్సన్ పావనీయాదవ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387